క్లుప్తంగా

నేడు మండల సమావేశం

మక్కువ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ఉదయం సర్వసభ్య సమావేశం నిర్వహించి, మధ్యాహ్నం బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

సంకిలి కర్మాగారానికి చెరకు తరలింపు



సంకలి కర్మాగారానికి తామరఖండి నుంచి లారీతో వెళ్తున్న చెరకు

సీతానగరం: మండలంలోని రైతులు పండించిన చెరకు సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారానికి మంగళవారం నుంచి తరలిస్తున్నారు. ఎన్‌సీఎస్ కర్మాగారం పరిధిలో వందలాది మంది రైతులు వర్షాధార భూముల్లో చెరకు ఉత్పత్తి చెయ్యడం ఆర్థికంగా లబ్ధి పొందడం జరిగేది. లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ కర్మాగారం మూతపడడం వలన ఇక్కడి రైతులు పండించిన చెరకును ఈఐడీ ప్యారీ యాజమాన్యం కొనుగోలు చేయాలని ఇచ్చిన సూచనల మేరకు యాజమాన్యం 2023 – 24 క్రషింగ్ సీజనుకు రైతులు ఉత్పత్తి చేసిన చెరకును కర్మాగారానికి తరలించడానికి పాస్‌లు ఇవ్వడంతో మంగళవారం తామరఖండి నుంచి వి.ప్రభాకరరావు చెరకును లారీతో తరలిస్తున్నారు.

ఏరియా ఆస్పత్రి ఏఓగా సింహాచలం



ఏఓ సింహాచలంను అభినందిస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ రత్నకుమారి, వైద్యాధికారులు, సిబ్బంది

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నూతన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా సింహాచలం నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన విధుల్లో చేరారు. ఆయనకు మెడికల్ సూపరింటెండెంట్ రత్నకుమారి, వైద్యాధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈయన గతంలో అగనంపూడి ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా పని చేసినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

కొవ్వొత్తుల ర్యాలీ



జీగిరాంలో కొవ్వొత్తుల ర్యాలీ

సాలూరు: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని రూరల్ ఎస్‌ఐ ప్రయోగమూర్తి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం మండలంలోని జీగిరాం గ్రామంలో రూరల్ ఎస్‌ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులు, వారి సేవలను వివరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్తులు, పోలీసులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ వితరణ



విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న ఎస్ సొసైటీ సభ్యులు

కురుపాం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షకు సంబంధించి, స్టడీమెటీరియల్‌ను విశాఖపట్నానికి చెందిన యూత్ ఫర్ సేవా సంస్థ సహకారంతో ఎస్ (యూత్ ఎంపవర్‌మెంట్ సర్వీస్) సొసైటీ కార్యదర్శి షేక్ గౌష్ ఆధ్వర్యంలో మంగళవారం వితరణ చేశారు. ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని, ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ కనబరచాలని ఎంఈవో ఎన్.సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు శంకరరావు కోరారు.

పరామర్శ

భామిని: పాతపట్నం వసతిగృహంలో ఆత్మహత్య చేసుకున్న ఇంటర్మీడియట్ విద్యార్థి కనపల అమృత కుటుంబాన్ని సీపీఎం మండల కన్వీనర్ గొర్లె జగన్నాయకులు, గిరిజన సంఘం అధ్యక్షుడు కొండగొర్రి భాస్కరరావు పరామర్శించారు. మంగళవారం మండలంలోని దిమ్మిడిజోల గ్రామానికి వెళ్లి, విద్యార్థిని కుటుంబ సభ్యులను కలిసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

ప్రజారోగ్యానికే.. 'ఆరోగ్య సురక్ష'

రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్య భద్రత బాధ్యతను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారని, ఇందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలుచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. శిబిరాల్లో పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.
– సాక్షి నెట్‌వర్క్



సీతానగరం: తామరఖండిలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సీతానగరం: తామరఖండి శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న స్పెషలిస్ట్ డాక్టర్ పి.అప్పారావు



పార్వతీపురం టౌన్: నడిమి ములగలో జేఏఎస్ ఏర్పాట్లుపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే జోగారావు



సాలూరు: శివరాంపురంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

ఘనంగా 'సర్దార్' జయంతి



పార్వతీపురం టౌన్:ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు అధికారులు

పార్వతీపురం టౌన్: మాజీ ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దేశ సమైక్యత, సమగ్రతలకు అంకితభావంతో పాటుపడదామని రిజర్వు ఇన్‌స్పెక్టర్ కుమార్ అధికారులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఎస్పీ గారి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణ నుంచి రన్‌ఫర్ యూనిటీ (2కే రన్)ని ప్రారంభించారు. ఈ 2కే రన్ పోలీస్ కార్యాలయం నుంచి వైకేఎం జంక్షన్, కోర్టు రోడ్డు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్ కుమార్, శ్రీనివాసరావు, పట్టణ ఎస్‌ఐ దినకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం



సాలూరు : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సాలూరు: భారతదేశ మాజీ ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో ఐక్యతా దినోత్సవం సందర్భంగా వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, పలువురు ప్రజాప్రతినిదులు, అధికారులు ప్రతిజ్ఞ చేసారు. 3 కే రన్ నిర్వహించారు. పట్టణంలోని వెంకటవిద్యాగిరి పాఠశాలలో వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సిబ్బంది దాడులు

పార్వతీపురం టౌన్: ఒడిశా నుంచి సారాను రవాణా చేస్తున్న అందిన సమాచారం మేరకు మండలంలోని ఎమ్మార్‌నగరం సమీపంలో దాడులు చేసి ఒక బైక్‌ను స్వాధీనం చేసుకొని 120 లీటర్ల సారాను సీజ్ చేసినట్టు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర మంగళవారం తెలిపారు. పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామానికి చెందిన బంగారి రాజశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే పార్వతీపురం మున్సిపాలిటీ పరిధి నవిరి కాలనీ వద్ద సారాను విక్రయిస్తున్న మీసాల రవిపై కేసు నమోదు చేసి 200 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని రిమాండ్ నిమిత్తం మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరిచినట్టు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా

భామిని: పక్కాగా ఓటరు జాబితా సిద్ధం కావాలని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని తహసీల్దారు నీలాపు అప్పారావు సూచించారు. మండల కేంద్రంలో బీఎల్‌వోలతో మంగళవారం సమావేశమైన ఆయన ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదలైందని, దాని ప్రకారం ఓటర్ల ఓట్లు ఉన్నవీ లేనివీ వారితోనే పరిశీలించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామపంచాయతీ కార్యాలయం గానీ సచివాలయం వద్ద గానీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శించాలని సూచించారు. ఓటరు జాబితాలో మృతుల ఓటు ఉంటే వారి ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఆ ఓట్లు తొలగించాలన్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన యువతీయువకులతో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేయించాలన్నారు. ఓటరు జాబితాలో ఇంటి నంబర్లు సున్నాగా వచ్చిన వాటిని సరిచేయాలన్నారు. సమావేశంలో డీటీ నిమ్మల శేఖరం తదితరులు పాల్గొన్నారు.

పాడైన పంటల జాబితా సిద్ధం చేయాలి

భామిని: సీటీఎడ్డడి, కరువు పరిస్థితుల కారణంగా పాడైన పంటల జాబితా సిద్ధం చేయాలని ఏవో రేగిడి మన్మధరావు సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్)లతో మంగళవారం సమావేశమైన ఆయన ప్రస్తుతం రైతులు వేసిన పంటల పరిస్థితులపై ఆరాతీశారు. చాలారోజులుగా వర్షాలు లేకపోవడంతో నీరు లేక పంటలు ఎక్కడైనా ఎండిపోయాయా.. పాడయ్యాయా.. అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వరిపంట కోత దశకు వచ్చేటప్పుడు పంటను ఎలాగైనా కాపాడుకోవాలని, రైతులను అడిగి, నష్టపోయిన పంటల వివరాలు సేకరించాలన్నారు.

అంబులెన్స్ పైలట్ మృతి



తవిటినాయుడు(ఫైల్)

జియ్యమ్మవలస: అనారోగ్యంతో మండలంలోని చినమేరంగి 108 అంబులెన్స్ పైలట్ బంటు తవిటినాయుడు మంగళవారం మృతి చెందారు. గత కొన్నిరోజులుగా హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్‌లతో బాధపడుతున్న ఆయన విజయనగరంలోని తిరుమల ఆస్పత్రిలో చికిత్స పొందు తూ చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపా రు. ఆయన మృతి పట్ల తోటి సిబ్బంది సంతా పం ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యుల కు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


రిఫర్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

తెర్లాం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉన్నత వైద్య సేవల కోసం రిఫర్ చేసిన కేసులు(రోగులు)పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తెర్లాం, పెరుమాళి పీహెచ్‌సీల వైద్యులు, ఎంపీహెచ్‌ఏలు, ఏఎన్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో వైద్యాధికారులు, సిబ్బంది పాత్ర అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మండలంలో 174 మంది రోగులను వేరే ప్రాంతాల్లోని ఆస్పత్రులకు మెరుగైన వైద్య సేవల నిమిత్తం రిఫర్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. వారంతా వారికి కేటాయించిన ఆస్పత్రులకు వెళ్లి, వైద్యం చేయించుకున్నారా, లేదా అనే విషయం తెలుసుకోవాలన్నారు. వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు, సీహెచ్‌వో భాస్కరరావు పాల్గొన్నారు.


మంగన్న, కోరన్నల ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నేత కృష్ణమూర్తి



గుమ్మలక్ష్మీపురం: మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య



కొమరాద: కేంద్రం తీసుకువచ్చిన అటవీ సంరక్షణ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న గిరిజనులు

కురుపాం: శ్రీకాకుళం గిరిజనోద్యమ నాయకులు మంగన్న, కోరన్నల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు ఎం.కృష్ణమూర్తి కోరారు. మండలంలోని నీలకంఠాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న మామిడి మానుగూడ గ్రామంలో మంగన్న, కోరన్నల 56వ వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన నేడు గిరిజనులు అనుభవిస్తున్న హక్కులు, అభివృద్ధికి మూలకారణం నాడు శ్రీకాకుళం ఉద్యమంలో అసువులు బాసిన మంగన్న, కోరన్నలేనన్నారు. గిరిజనుల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసి, తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన గొప్పయోధులని కొనియాడారు. అటువంటి మహనీయుల అడుగుజాడల్లో మనమంతా నడవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తిరుపతిరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.అవినాష్‌కుమార్, ఎంపీటీసీ ఎం.రవణ, కుక్కిడి సర్పంచ్ బి.రాజారావు, కొండగొర్రి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

తుపాకీతో కాల్చి చంపారు..

గుమ్మలక్ష్మీపురం: గిరిజనోద్యమ నాయకులు మంగన్న, కోరన్నల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బీఎస్‌ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తోట జీవన్న అధ్యక్షతన మంగన్న, కోరన్నల వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ పోవాలని, పాలేరు వ్యవస్థ రద్దు చేయాలని, భూములన్నీ గిరిజనులకే చెందాలన్న డిమాండ్లతో 1967లో మొండెంఖల్లులో భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన బహిరంగ సభకు బయలుదేరి వెళ్తుండగా కొంతమంది భూస్వాములు కోరన్నను దొంగచాటుగా తూపాకీతో కాల్చి చంపారని, మంగన్నను పెద్ద బండరాయితో తలపై మోది చంపారని గుర్తు చేశారు. వారి ప్రాణత్యాగాల స్ఫూర్తితోనే శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమం విజయవంతమయ్యేందుకు దోహదపడిందన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రతిఒక్కరం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, కొండంగి లింగరాజు పాల్గొన్నారు.

కొమరాద: మండలంలోని చినఖేర్జిల గ్రామంలో మంగన్న, కోరన్నల వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీఎఫ్ జాతీయ కమిటీ సభ్యురాలు సంబుడు జయలక్ష్మి మాట్లాడుతూ శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధులు మంగన్న, కోరన్నల స్ఫూర్తితో కేంద్రం తీసుకువచ్చిన అటవీ సంరక్షణ నియమాల సవకరణ చట్టం–2023 రద్దు కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అడవుల పరిరక్షణ పేరుతో ఆదివాసీలను అడవి నుంచి తరిమివేసేందుకు కేంద్రం ఈ చట్టం తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ చట్టం ద్వారా ఖనిజ సంపద ఉన్న అటవీ భూమిని కార్పొరేట్ సంస్థలకు కేంద్రం అప్పగించేందుకు సిద్ధమవుతోందని, దీనిని మనం ఎలాగైనా అడ్డుకోవాలన్నారు. అంతకుముందు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సభ్యులు పీడిక చిరంజీవులు, నూకమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నందెన్న అనుపోత్సవం



అప్పయ్యపేటలో నందీశ్వరుల అనుపోత్సవ తిరువీధి చేస్తున్న నిర్వాహకులు

సీతానగరం: మండలంలోని గౌరీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో భక్తులు ఏర్పాటు చేసిన మండపాలపై పార్వతీపరమేశ్వర్లు గౌరీదేవి కొలువు తీర్చిన ప్రతిమల అనుపోత్సవం అప్పయ్యపేటలో ఘనంగా జరిగింది. ఈ మేరకు గౌరీ పౌర్ణమి ఉత్సవాలు సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలపై భక్తులు పాలవెల్లిని ఏర్పాటు చేసి వివిధ రకాల పండ్లు, జ్యోతులు అమర్చారు. ఉత్సవాలు ఆరంభించిన మూడు రాత్రులు కావడంతో సోమవారం రాత్రి మేళతాళాలతో ఊరేగింపుగా పల్లకీలో తరలించి చెరువులో అనుపోత్సవం చేసారు. ఈ మేరకు మంగళవారం నిర్వాహకులు అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బి.సూర్యనారాయణ, ఆనందరావు, లక్షున్నాయుడు, గౌరునాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో పార్వతీపురం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పార్వతీపురం అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మంగళవారం మాట్లాడారు. పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో ఉన్న సీతానగరం, బలిజిపేట రెండు మండలాలను అనుసంధానం చేస్తూ బూర్జ–చిన అంకలాం గ్రామాల మధ్య సువర్ణముఖి నదిపై నూతన వంతెన నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశామన్నారు.

అత్యంత ప్రాధాన్యత అంశంగా భావించి పరిగణనలోనికి తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేస్తూ రూ.9 కోట్ల నిధులు కేటాయిస్తూ అధికారిక జీఓను విడుదల చేశారన్నారు. త్వరలోనే ఈ వంతెన నిర్మాణానికి అవసరమైన టెండర్లను అధికారులు పిలిచి వాటిని ఖరారు చేసి నిర్మాణ పనులను ప్రారంభం చేయడం జరుగుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు.

పశువైద్య సహాయకుల సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న పశువైద్యశాఖ ఏడీ డాక్టర్ సీహెచ్ దీనకుమార్, పశు వైద్యాధికారులు, పశు వైద్య సహాయకులు

సీతానగరం: పశువైద్య శాఖ సీతానగరం సబ్ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పశువైద్య సహాయకులు స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం సంబరాలు జరిపారు. సచివాలయ వ్యవస్థలో పశువైద్య సహాయకులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తూ గతంలో ఉత్తర్వులు ఇచ్చింది. ఈ క్రమంలో తాజాగా పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సీహెచ్ దీనకుమార్ ఆధ్వర్యంలో బలిజిపేట, సీతానగరం మండలాల పశు వైద్యాధికారుల ఆధ్వర్యంలో సహాయకులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మంగళవారం సంబరాలు నిర్వహించారు. రెండు మండలాల పశు వైద్యాధికారులు ఎస్.రామారావు, గణేష్, గ్రామీణ పశు వైద్యాధికారులు, వీపీఏలు, వీఎస్‌ఏలు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు

సీతంపేట: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనులకు సంబంధించి, సామాజిక తనిఖీలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి మొత్తం 4,934 పనులకు గాను 3,554 పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. వీటిలో 1,380 పనులు పూర్తయ్యాయి. వీటికోసం రూ.20 కోట్ల 95 లక్షల 71 వేలు వేతనదారులకు వేతనాల ద్వారా చెల్లింపులు చేశారు. అలాగే మెటీరియల్ ద్వారా రూ.19 కోట్ల 19 లక్షలు 51 వేలు చెల్లింపులు చేశారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఎన్ని పనులు జరిగాయి, జరిగిన పనులు నాణ్యతగా ఉన్నాయా లేదా వేతనదారులకు సక్రమంగా వేతనాలు అందించారా లేదా అనే విషయాపై వివరాలు సేకరించనున్నారు. వివిధ శాఖల ద్వారా జరిగిన పనులన్నీ తనిఖీలు చేయనున్నారు. ఇప్పటికే రికార్డుల ద్వారా కొన్ని వివరాలు సేకరించారు. ఈ తనిఖీల కోసం డీఆర్‌పీలు, సీఆర్‌పీల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నారు. 12 మంది డీఆర్‌పీలు, 15 మంది వీఎస్‌ఏలు స్థానిక ఉపాధి హామీ కార్యాలయానికి చేరుకున్నారు. అన్ని శాఖల సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించి, పనుల పరిశీలన చేస్తామని ని ఉపాధి ఏపీలు బాబూరావు, సాగర్ తెలిపారు.

సమన్వయంతోనే నగర పంచాయతీ అభివృద్ధి



మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ రాధాకుమారి

పాలకొండ: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే నగరపంచాయతీ అభివృద్ధి సాధ్యమని నగరపంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నగరపంచాయతీ పాలకవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేశారు. సమావేశంలో నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకే పరీక్షలు



విద్యార్థుల పరీక్ష పేపర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: రాష్ట్ర విద్యాసాధన సర్వేకు సంబంధించి, మండలంలోని పెదగుడబ, ఎస్ఆర్‌పేట ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన పరీక్షలను ఎంపీడీవో జి. పైడితల్లి పరిశీలించారు. విద్యార్థుల్లోని ప్రతిభ గుర్తించేందుకే ప్రభుత్వం ఎస్ఈఏఎస్ పరీక్షలను నిర్వహిస్తోందని ఆమె అన్నారు. మండలంలో ఎంపికైన పాఠశాలల్లో మాత్రమే 3,6,9 వ తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతిరోజూ ఈ పరీక్షలకు సంబంధించి, ప్రాక్టీస్ పేపర్లను విద్యార్థులతో సాధన చేయించాలలని ఎంఈ వో ఎస్.నాగభూషణరావు సూచించారు. ఎంపీడీవో వెంట ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు ఉన్నారు.

కార్మిక పక్షపాతి ఏఐటీయూసీ

రాజాం సిటీ: కార్మికుల పక్షపాతి ఏఐటీయూసీ అని ఆ సంఘ జిల్లా కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్ అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకుని స్థాని క ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పక్షాన పోరాటాలు చేసి సాధించిన విజయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పాల్గొన్నారు.